2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను రూపొందిద్దాం

గవర్నర్ ఆర్‌ఎన్ రవి



రాజ్‌భవన్‌లో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అక్షర నాట్యాలయ విద్యార్థుల నృత్యాన్ని తిలకిస్తున్న గవర్నరు దంపతులు, రాజ్‌భవన్ వర్గాలు

చెన్నై, న్యూస్‌టుడే: 2047 నాటికి పరిపూర్ణంగా అభివృద్ధి సాధించిన భారత్‌ను రూపొందిద్దామని గవర్నరు ఆర్.ఎన్.రవి పిలుపునిచ్చారు. ఆయుధ పూజ, సరస్వతి పూజ సందర్భంగా గవర్నర్ తన 'ఎక్స్' పేజీలో సందేశాన్ని పోస్టు చేశారు. అందులో.. సరస్వతీదేవి మన మార్గాన్ని తన కళా నైపుణ్యం, ప్రగాఢ జ్ఞానంతో ప్రకాశింపజేసి, అజ్ఞాన చీకట్లు తొలగించి మనందరికీ సంపదను, సంతోషాన్ని అందించాలని ఆకాంక్షించారు. ఈ ఆయుధపూజ మనకు కోలుకునే సామర్థ్యం, ప్రపంచ రూపకల్పనకు అవసరమైన సృజనాత్మకశక్తి సామర్థ్యాలను అందించాలని కాంక్షించారు. వసుధైక కుటుంబంగా ఉండి 2047 నాటికి అన్నింటినీ కలిగిన సంపూర్ణ అభివృద్ధి సాధించిన భారత్‌ను రూపొందిద్దామని పిలుపునిచ్చారు.

రాష్ట్రంపై వివక్ష తగదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్

చెన్నై, న్యూస్‌టుడే: పన్నుల పంపిణీలో రాష్ట్రంపై వివక్ష చూపడాన్ని కేంద్రంలోని భాజపా ప్రభుత్వం విడనాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ డిమాండ్ చేశారు. ఆయన తన ప్రకటనలో.. భాజపా పదేళ్ల పాలనలో పక్షపాతం చూపించిందని ఆరోపించారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు అన్యాయం చేసిందని విమర్శించారు. అందుకే ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కమలానికి ప్రజలు మెజారిటీ గెలుపు అందించలేదన్నారు. ఎన్నికల తర్వాత విద్వేష రాజకీయాలను ఆ పార్టీ విడిచి పెట్టలేదన్నారు. రాష్ట్రాలకు పన్నుల కేటాయింపుల్లో తమిళనాడును వంచించేలా వ్యవహరించడం ఖండించదగిందని తెలిపారు.

గవర్నర్‌తో గొడవలు వద్దు

సీఎం సూచించారన్న మంత్రి కోవి.చెళియన్


ప్రసంగిస్తున్న ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి.చెళియన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: గవర్నర్‌తో గొడవ పడొద్దని ముఖ్యమంత్రి సూచించారని ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి.చెళియన్ తెలిపారు. చెన్నైలో ఉన్నత విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉన్నతవిద్యలో విద్యార్థుల చేరికలో తమిళనాడు దేశంలోనే ముందంజలో ఉందన్నారు. 2030 నాటికి విద్యార్థుల చేరిక 50 శాతంగా ఉండాలని లక్ష్యం నిర్ణయించుకుని ఉన్నా... రాష్ట్రంలో ఉన్నత విద్య ప్రవేశాలు 59 శాతానికి చేరాయని తెలిపారు. రిజిస్ట్రార్, సూపరింటెండెంట్ ఖాళీ పోస్టుల విషయాన్ని ముఖ్యమంత్రితో చర్చించి భర్తీ చేస్తామన్నారు. ఉపకులపతి నియామకాన్ని ప్రభుత్వ అభిప్రాయం తెలుసుకుని త్వరగా అమలు చేస్తామన్నారు. రాజధాని కళాశాల విద్యార్థిపై పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులు దాడి చేయడంతో చనిపోయిన ఘటన ఆవేదనకు గురిచేసిందన్నారు. ఇలాంటివి పునరావృతమవకుండా కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. తమిళనాడు గవర్నర్‌తో గొడవలు వద్దని, విద్యార్థుల సంక్షేమం కోసం అవసరమైన వాటిని పక్కాగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారని చెప్పారు.

బస్సుపైకెక్కి విద్యార్థుల అల్లరి



ప్యారిస్, న్యూస్‌టుడే: విద్యార్థులు బస్సుపైకెక్కి అల్లరికి పాల్పడిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చెన్నై టీనగర్ నుంచి కున్రత్తూర్ వెళ్లే 88కె బస్సులో గురువారం మధ్యాహ్నం పచ్చయప్పాస్ కళాశాల వద్ద 30 మంది విద్యార్థులు ఎక్కారు. వారిలో కొందరు బస్సు పైకి వెళ్లి అల్లరి చేశారు. సమాచారం అందుకున్న గిండి ట్రాఫిక్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూడగానే విద్యార్థులు కిందకు దిగారు. సుమారు 20 నిమిషాల పాటు విద్యార్థులు బస్సు పైన నిలబడిన ప్రజలను ఇబ్బందికి గురిచేయడం తీవ్ర కలకలం సృష్టించింది.

పైన పుత్తడి.. లోన ఇత్తడి



- స్కానర్లూ పసిగట్టలేనంతగా నకిలీ ఆభరణాల తయారీ
- అసలు బంగారం బ్లాక్ మార్కెట్‌లో విక్రయం
- ఆర్‌బీఐని బురిడీ కొట్టించిన ఏజెన్సీలు
- డీఆర్ఐ నివేదికల్లో బట్టబయలు

గత కొన్నేళ్లుగా చెన్నై కేంద్రంగా జరుగుతున్న ఆభరణాల స్కామ్‌ను డీఆర్ఐ బయటపెట్టింది. దీనిపై ఈమధ్యకాలంలో నివేదికలు విడుదలచేసింది. ఈ స్కామ్ లోతుల్లోకి వెళ్లేకొద్దీ.. ఆశ్చర్యకర విషయాలే తొంగిచూశాయని డీఆర్ఐ వ్యక్తంచేస్తోంది. అక్రమాలకు పాల్పడేందుకు చెన్నైకు చెందిన సంస్థలు పన్నిన తెలివితేటలు విస్మయానికి గురిచేశాయి. ఇవన్నీ నిఘావర్గాలు ఛేదించినట్లు నివేదికలో వివరించింది.

ఈనాడు-చెన్నై

డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) నిఘా విభాగాలు అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాలపై కన్నేసి ఉంటాయి. అలా చాలా కుట్రలు, స్కాముల్ని బయటపెట్టాయి. గతేడాది జనవరి, ఈ సంవత్సరం సెప్టెంబరులో డీఆర్ఐ విడుదలచేసిన నివేదికల్లో కీలక విషయం వెల్లడించాయి. చెన్నైకి చెందిన ఆరు ఏజెన్సీలు బంగారు ఆభరణాల్ని తరలించడంలో పెద్ద ఎత్తున స్కామ్‌కే పాల్పడ్డారని అందులో పేర్కొన్నాయి. వారంతా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నామినేట్ చేసిన ఏజెన్సీలేనని, ఆర్‌బీఐ నుంచి సుంకం లేకుండా బంగారు బిస్కెట్లను తీసుకుని వాటిని ఆభరణాలుగా తయారుచేసి ఎగుమతికి అనుమతి తీసుకుని.. యథేచ్ఛగా బ్లాక్‌మార్కెట్‌కు తరలించి అక్రమంగా డబ్బులు సంపాదించారు.

కోల్‌కతా, ముంబయికి తరలించి..

ఆర్‌బీఐకి తెలియకుండా భారీ ఎత్తున బంగారాన్ని ఆయా సంస్థలు బ్లాక్ మార్కెట్లకు తరలించాయి. డీఆర్ఐ నివేదికల ప్రకారం.. 2,507 కిలోల బంగారాన్ని ఎగుమతి చేసినట్లు లెక్కల్లో చూపినా 90శాతం అంటే 2,170 కిలోల్ని బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకున్నారు. వాటి విలువ రూ.941 కోట్లుగా ఉంటుందని డీఆర్ఐ లెక్కలు కట్టింది. 337.02 కిలోల బంగారాన్ని చెన్నైతో పాటు కోల్‌కతా, ముంబయి, రాజ్‌కోట్ ప్రాంతాలకు తరలించి పుత్తడి నగల్లా తలపించే ఆభరణాల తయారీకి వాడుకున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం 2,612 కిలోల ఇతర పదార్థాలు వాడినట్లు గుర్తించారు.

యంత్రాలను, అధికారులను మోసగించి..

- ఆర్‌బీఐని మోసం చేసిన ఏజెన్సీలు ఇటు కస్టమ్స్ అధికారుల్ని సైతం తమకు అనుకూలంగా మార్చుకున్నట్లు డీఆర్ఐ పలు ఆధారాలు చూపింది. ఆయా ఏజెన్సీలు చెన్నై ఎయిర్‌కార్గో ద్వారా దుబాయ్, మలేషియాకు ఎగుమతి చేసిన బంగారాన్ని రికార్డుల్లో మాత్రం 22 క్యారెట్‌లుగా నమోదుచేశారు. అవన్నీ నకిలీ ఆభరణాలు.
- బంగారాన్ని తనిఖీ చేసే ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్, ఎక్స్‌రే ఫ్లోరెసెంట్ యంత్రాల స్కానర్లను సైతం మభ్యపెట్టే కుట్రలు సైతం చెన్నై ఎయిర్‌పోర్టులో చోటుచేసుకున్నాయి. ఇది ఏళ్లుగా జరుగుతోంది. యంత్రాల సాంకేతికత సామర్థ్యాన్ని అర్థం చేసుకుని దానికి మించిన గిమ్మిక్కుల్నే అక్రమార్కులు ప్రదర్శించారని విచారణలో వెల్లడైంది.
- పుత్తడితో చేయని ఆభరణాలకు బంగారం పూత పూసి.. స్వచ్ఛమైనవి ఎగుమతి చేస్తున్నట్లుగా ఎలక్ట్రోప్లేటింగ్(పూత) పూశారు. ఈ ఎత్తుగడను యంత్రాలు పసిగట్టలేకపోయాయి. ఆర్‌బీఐకి పత్రాల్లోనూ ఇవే చూపారు.
- ఎక్స్‌రే ఫ్లోరెసెంట్ యంత్రాల్లో బంగారం ఎంత స్వచ్ఛమైనవనే గణాంకాలు సైతం బయట పడతాయి. ఆభరణాన్ని స్కాన్ చేసేముందు.. పైపూతను గోకి ఆ తర్వాత పరీక్షలకు పంపాల్సి ఉంది. ఆభరణాల ఉపరితలాన్ని మిలమిలా మెరిసేలా, శుభ్రంగా ఉండేలా, అచ్చు స్వచ్ఛమైనదిగా అనిపించేలా ఉన్న స్థితిలోనే యంత్రాల్లోకి పంపడంతో.. వాటి నివేదికలు కూడా ఇవి స్వచ్ఛమైన బంగారమనే వచ్చాయి. ఇందుకోసం కస్టమ్స్ అధికారులతోనూ కుట్రపన్నారని తెలుస్తోంది.
- పైపూతను ఎందుకు స్క్రాచ్ చేయలేదని డీఆర్ఐ నిఘా అధికారులు కస్టమ్స్ వారిని ప్రశ్నించినప్పుడు.. ఆభరణాలు పాడవుతాయనే ఉద్దేశంతో అలా చేయలేదని సమాధానమిచ్చినట్లు సమాచారం. కస్టమ్స్‌కు చెందిన ముగ్గురు కీలక అధికారులు ఈ స్కామ్‌లో ఆయా ఏజెన్సీలకు బాగా సహకరించినట్లు చూపారు. ఇందులో వాడని బంగారాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించారు.

రైల్లో బయటపడ్డ కుట్ర

చెన్నై నుంచి వివిధ మార్గాల్లో బంగారాన్ని బ్లాక్ మార్కెట్లకు తరలించారు. కన్ఫర్మ్ అయ్యే అవకాశంలేని వెయిటింగ్ లిస్టులో ఉన్న టికెట్లను మాత్రమే స్మగ్లింగ్ ముఠాకు అప్పగించి.. అక్రమ బంగారాన్ని వారిద్వారా రైళ్లలో తరలించేవారు. కీలక సమాచారాన్ని అందుకున్న డీఆర్ఐ కూపీలాగింది. ప్రధానంగా చెన్నై-కోల్‌కతా మధ్యలో ఈ కుట్ర బయటపడింది. స్మగ్లర్లు తమపై అనుమానం రాకుండా.. రైళ్లలో ప్రయాణించలేదని చెప్పడానికి వీలుగా వెయిటింగ్‌లిస్టు టికెట్లను వాడుతున్నారని తేలింది. వారి కాల్ రికార్డులు చూస్తే.. అసలు వారు ప్రయాణం చేయనేలేదని, చెన్నైలోనూ.. మదురైలోనూ ఉన్నట్లు టవర్ చూపడంతో విస్మయానికి గురయ్యారు. ఈ కుట్రలన్నింటినీ డీఆర్ఐ భగ్నం చేసింది. వారు తీసుకెళ్లే పార్సిళ్లలో ఇతర ఆభరణాలు చూపినా.. లోపల మాత్రం బంగారం తరలిస్తున్నట్లు గుర్తించారు. ఇలా రూ.వందలకోట్ల విలువైన పుత్తడి దొరికింది.

మురసొలి సెల్వం భౌతికకాయానికి ప్రముఖుల నివాళి


సెల్వం భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సభాపతి అప్పావు ◆ సెల్వ పెరుంతగై ◆ నక్కీరన్ గోపాల్ ◆ వీరమణి

చెన్నై, న్యూస్‌టుడే: పాత్రికేయుడు మురసొలి సెల్వం భౌతికకాయానికి శుక్రవారం పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన గుండెపోటుతో గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. గోపాలపురం నివాసంలో ఉంచిన ఆయన భౌతికకాయానికి పలువురు నివాళులర్పించారు. రెండోరోజు శుక్రవారం ముఖ్యమంత్రి స్టాలిన్, సభాపతి అప్పావు, దురైమురుగన్ తదితర మంత్రులు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మహానగర చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, డీఎంకే నిర్వాహకులు నివాళులర్పించారు. ద్రావిడ కళగం అధ్యక్షుడు కె.వీమణి, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షులు కేవీ తంగబాలు, తిరునావుక్కరసర్, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, నక్కీరన్ పత్రిక సంపాదకుడు గోపాల్ తదితరులు నివాళులర్పించారు. సినీరంగ ప్రముఖుల్లో దర్శక నటులు ఎస్ఏ చంద్రశేఖర్, త్యాగరాజన్, నటులు విజయకుమార్, అరుణ్ విజయ్, పార్తిబన్, కరుణాస్ తదితరులు నివాళులర్పించారు.

బస్సులు, రైళ్లు కిటకిట

చెన్నై నుంచి రెండ్రోజుల్లో 7లక్షల మంది ప్రయాణం



ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఆయుధపూజ, విజయదశమి, ఆదివారం వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో చదువు, ఉద్యోగాల నిమిత్తం వేరే ప్రాంతాల్లో ఉండేవారు సొంతూళ్లకు పయనమవుతున్నారు. బుధవారం నుంచే వారి సౌకర్యార్థం ప్రభుత్వ రవాణ సంస్థల తరఫున ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించేందుకు 50వేలమందికి పైగా రిజర్వేషన్ చేసుకున్నారు. చెన్నై నుంచి రోజూ తిరిగే 2,100 బస్సులతో పాటు రెండురోజులుగా 2వేలకు పైగా బస్సులు అదనంగా నడిపారు. వాటిల్లో ప్రయాణించేందుకు కిలాంబాక్కం, కోయంబేడు, మాధవరం తదితర బస్టాండ్‌లకు జనం చేరుకోవడంతో సందడి నెలకొంది. బస్టాండ్లకు వెళ్లేందుకు ఎంటీసీ, ఎలక్ట్రిక్, మెట్రోరైళ్లను ఆశ్రయించడంతో అవి కిక్కిరిశాయి. చుట్టుపక్కల జిల్లాలకు చెందినవారు సొంత వాహనాల్లో ఊర్లకు వెళ్తుండడం, పూజా సామగ్రి కొనుగోలుకు ప్రజలు అధికంగా దుకాణాలకు రావడంతో ఆయా ముఖ్య ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చెన్నై ఎగ్మూర్, సెంట్రల్, తాంబరం రైల్వేస్టేషన్‌లలో ప్రయాణికుల రద్దీ అధికమైంది. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఎక్కువ దూరం ప్రయాణించేవారికి సీట్లు దొరక్కపోవడంతో ఆమ్ని బస్సులను ఆశ్రయించారు. రెండ్రోజులుగా చెన్నై నుంచి ప్రభుత్వ, ఆమ్ని బస్సుల ద్వారా 3 లక్షల మందికిపైగా, రైళ్లలో 4లక్షల మందికిపైగా సొంతూళ్లకు ప్రయాణించారు.

విజయ్ విజయదశమి శుభాకాంక్షలు

చెన్నై, న్యూస్‌టుడే: ఆయుధపూజ, విజయదశమి సందర్భంగా ప్రముఖ సినీనటుడు, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తన 'ఎక్స్' పేజీలో.. పరిశ్రమ వనరుల్లో అభివృద్ధి సాధించడానికి ఆధారంగా ఉన్న పరిశ్రమ యంత్రాలు, ఉపయోగించే వాహనాలు, జ్ఞానాన్ని బోధించే పుస్తకాలను పూజించే ఆయుధపూజ, సరస్వతి పూజ, విజయదశమి నాడు చేపట్టే అన్ని కొత్త ప్రయత్నాలు విజయం సాధించాలంటూ శుభాకాంక్షలు తెలిపారు.


తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని చెన్నై టీనగర్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం అశ్వవాహనంపై కొలువుదీరిన స్వామివారు. -టీనగర్, న్యూస్‌టుడే

యోగామున్న యువతి

- జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్న విద్యార్థిని
- తండ్రే గురువై మార్గనిర్దేశం
- పాల్గొంటే పతకం పక్కా అంటున్న నవ్య

ప్రతి వ్యక్తి విజయం వెనుక ఎవరోఒకరి ప్రోత్సాహం, సహాయం ఉంటాయి. అలానే యోగాపై కుమార్తెకున్న ఆసక్తిని గుర్తించిన ఓ తండ్రి తానే గురువుగా మారి జాతీయ స్థాయిలో పలు పోటీల్లో పాల్గొని గెలుపొందేందుకు మార్గదర్శకుడయ్యారు. అలా వరుసగా నాలుగేళ్లుగా ఖేలో ఇండియా యోగా పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించి సత్తా చాటుతోంది నవ్య. ఆమె విజయ ప్రస్థానం గురించి నవ్య మాటల్లోనే తెలుసుకుందాం.. **- న్యూస్‌టుడే, ఆర్కేనగర్**

నాన్న మాటలే స్ఫూర్తిదాయకం

తండ్రి హరీష్ సిద్ధ వైద్యుడు. నాగర్‌కోవిల్‌లో క్లినిక్ నడుపుతున్నారు. నాకు ఆరో తరగతి చదివే సోదరుడున్నాడు. నాగర్‌కోవిల్‌లోని ఆలూర్ మా స్వగ్రామం. అక్కడే ప్లస్‌టూ వరకు చదివాను. తండ్రి వైద్యుడైనా యోగాపై మంచి పట్టుంది. పలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేవారు. ఆయన్ను చూసే నాకూ యోగాపై చిన్నతనం నుంచి ఆసక్తి ఏర్పడింది. గమనించిన నాన్న గురువుగా మారి తర్ఫీదు ఇచ్చారు. పాఠశాల, ట్యూషన్ మధ్య ఖాళీ సమయంలో ఆరుగంటలపాటు శిక్షణ ఇచ్చేవారు. దీంతో కేవలం ఐదు గంటలు మాత్రమే నిద్రించేదాన్ని. ఇలా కఠినంగా శ్రమించి అభ్యసించాను. ప్రతిక్షణం వెన్నంట ఉండి ముందుకు నడిపించారు. జాతీయ స్థాయిలో జరిగే ప్రతి పోటీకి ఆయనే తీసుకెళ్లేవారు. ఒకానొక సమయంలో శిక్షకుడిగా ఉండాలంటే అందుకు తగిన కోర్సును పూర్తి చేయాలనే నిబంధన ఉండేది. దానిని కూడా నా కోసం చదివి ముగించి ఒక్కో పోటీకి నన్ను ప్రోత్సహిస్తూ వచ్చారు. మిగిలిన వారికంటే ఒక అడుగు పైన ఉండాలంటే కష్టపడాలని, అలా అయితేనే విజేతగా నిలుస్తామని ప్రతిక్షణం చెబుతూ పెంచారు నాన్న. ఆ మాటలు నాలో స్ఫూర్తిని నింపాయి. ఇప్పుడు యోగాలో వరుసగా జాతీయ స్థాయిలో నాలుగు బంగారు పతకాలు సాధించేలా చేశాయి.


పతకాలతో నవ్య

ఆసియా స్థాయిలో రాణించేలా..

ఏడేళ్ల వయసు నుంచే యోగా పోటీల్లో పాల్గొంటున్నాను. మొదటిసారిగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం గెలవడం జీవితంలో మరచిపోలేనిది. 2017 నుంచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని 14 బంగారు పతకాలు సాధించాను. ఖేలో ఇండియా పోటీల్లో వరుసగా నాలుగేళ్లు బంగారు పతకాలు అందుకున్నాను. చివరిగా చెన్నైలో ఈ పోటీలు జరిగాయి. నేను పాల్గొని 18ఏళ్లలోపు విభాగంలో స్వర్ణ పతకం గెలిచాను. జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న నేను ఆసియా స్థాయిలో, ఒలింపిక్స్‌లో పతకాలు గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఇప్పుడు యోగా ఒలింపిక్స్‌లో లేదు. కానీ, చేర్చాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. తదుపరి ఒలింపిక్స్‌లో యోగా ఉంటుందనే నమ్మకం ఉంది. చైనా, అమెరికా మనకు పోటీగా ఉన్నా మనమే ముందంజలో ఉన్నాము.


యోగాసనంలో...

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది

కఠోర శ్రమ, నిబద్ధత, ఆత్మవిశ్వాసం ఉంటే ఏదైనా సాధించవచ్చు. తనకు తన తండ్రి మార్గదర్శకుడిగా ఉన్నట్లే ప్రతి ఒక్కరికి ఎవరోఒకరు వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తే ఏదైనా సాధించగలం. అలానే రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం క్రీడాకారులకు అనేక సదుపాయాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది. జాతీయ స్థాయిలో రాణించేవారికి రూ.2లక్షల నగదు బహుమతి అందిస్తోంది. ఆ మేరకు ఏటా మూడు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలుస్తున్నాను. ఇందుకు గత నాలుగేళ్లలో రూ.6లక్షలు బహుమతిగా పొందాను. ఇలానే యువతీయువకులు క్రీడల్లో రాణించగలిగితే నగదు బహుమతితో పాటు ఉద్యోగావకాశాలు పొందవచ్చు.

12న కులశేఖరపట్టిణం శూరసంహారం


4 వేల మందితో భద్రత


మాట్లాడుతున్న ఎస్పీ ఆల్బర్ట్ జాన్

ప్యారిస్, న్యూస్‌టుడే: తూత్తుక్కుడి జిల్లా కులశేఖరపట్టిణంలో శూరసంహారం సందర్భంగా 4 వేల మంది పోలీసులు భద్రతా విధులు చేపడుతున్నట్లు ఎస్పీ ఆల్బర్ట్ జాన్ తెలిపారు. ఇక్కడి జ్ఞానమూర్తీశ్వరర్ ముత్తారమ్మన్ ఆలయంలో ఏటా దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. వేడుకలకు పలు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. 10 రోజుల పాటు భక్తులు వ్రతం ఉండి వివిధ వేషధారణలతో అమ్మవారిని పూజిస్తారు. ఈ సంవత్సరం ఉత్సవాలు 3న ధ్వజారోహణతో మొదలయ్యాయి. ముఖ్య కార్యక్రమమైన శూరసంహారం 12న అర్ధరాత్రి కులశేఖరపట్టిణం సముద్రతీరంలో జరగనుంది. సుమారు 10 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొనే అవకాశం ఉంది. భద్రతా ఏర్పాట్లపై శుక్రవారం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. శూరసంహారం జరిగే ప్రాంతమంతటా సుమారు 250కి పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా పెట్టామన్నారు. భక్తులు కులం గుర్తులు తెలిపేలా జెండాలు, టీ షర్టులు వేసుకోకూడదని, అలా వస్తే చర్యలు చేపడతారని హెచ్చరించారు. ఆయుధాలతో రాకూడదని తెలిపారు. తాత్కాలికంగా మూడు బస్టాండులు, 30 తాత్కాలిక పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒకే సమయంలో 17 వేల వాహనాలను పార్క్ చేసుకోవచ్చన్నారు. దేవాదాయశాఖ తరఫున భక్తులకు అవసరమైన అన్ని వసతులు, 24 గంటలు పనిచేసేలా వైద్య సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. భక్తులు సురక్షితంగా దర్శనం చేసుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు వివరించారు.

9నెలల్లో 91,161 ఫిర్యాదులు

పెరుగుతున్న సైబర్ నేరాలు ◆ అదనపు డీజీపీ సందీప్ మిట్టల్



ప్యారిస్, న్యూస్‌టుడే: సైబర్ నేరాలకు సంబంధించి తొమ్మిది నెలల్లో 91,161 ఫిర్యాదులు వచ్చినట్లు, రూ.526 కోట్లను స్తంభింపజేసినట్లు రాష్ట్ర సైబర్ క్రైం విభాగం అదనపు డీజీపీ సందీప్ మిట్టల్ తెలిపారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. ఆన్‌లైన్ వినియోగం పెరగడంతో సైబర్ నేరాలు పెద్ద సమస్యగా మారాయని తెలిపారు. సాఫ్ట్‌వేర్ దాడులు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, కేవైసీ మోసం, క్రిప్టోకరెన్సీ, డిజిటల్ అరెస్టు తదితరమైనవి ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. ఈ నేరాల్లో నేరస్థులు ఎవరో స్పష్టం తెలియడం లేదన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు సైబర్ మోసాలకు గురైన ప్రజలు రూ.1,116 కోట్లు కోల్పోయారని, అందులో రూ.526 కోట్లను బ్యాంకు ఖాతాల్లో స్తంభింపచేసినట్లు పేర్కొన్నారు. రూ.48 కోట్లు తిరిగి బాధితులకు అప్పగించినట్లు చెప్పారు. సైబర్ మోసాలబారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు, ఆన్‌లైన్‌లో ఎవరినీ అరెస్టు చేయడం కుదరదన్నారు. అలా ఎవరైనా ఫోన్ చేస్తే భయపడాల్సిన అవసరం లేదని, నగదు చెల్లించాల్సిన పనిలేదన్నారు. స్నేహితులు, బంధువులు చెప్పారని టెలిగ్రామ్, వాట్సాప్‌లలో తెలియని గ్రూపుల్లో చేరొద్దని సూచించారు.

పుస్తక పఠనంతో తగ్గుతున్న సైబర్ నేరాలు

హైకోర్టు న్యాయమూర్తి జగదీష్‌చంద్ర


పుస్తకాలు తిలకిస్తున్న న్యాయమూర్తి జగదీష్‌చంద్ర

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుస్తకాలు చదవడంతో సైబర్ నేరాలు తగ్గుతున్నాయని మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జగదీష్‌చంద్ర తెలిపారు. దిండుక్కల్ డడ్లీ మహోన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన పుస్తకోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పుస్తక పండుగల ద్వారా విద్యార్థుల్లో మేధో నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచనలు వృద్ధి చెందుతాయని చెప్పారు. రాజకీయాలు, భావజాలం, కుల, మతాలకు అతీతంగా, తమిళులుగా ఏకం చేసే పుస్తకోత్సవాన్ని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఇలాంటి ప్రభుత్వం మరిన్ని నిర్వహించాలని కోరారు. కలెక్టర్ పూంగుడి తదితరులు పాల్గొన్నారు.

టీవీకే మహానాడు వేదిక నిర్మాణ పనులు ముమ్మరం


పోలీసులకు సూచనలిస్తున్న డీజీ దిశా మిట్టల్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విక్రవాండి సమీపంలోని వి.సాలైలో ఈనెల 27న జరిగే టీవీకే మహానాడుకు వేదిక నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనులను శుక్రవారం విక్రవాండి డీజీ దిశా మిట్టల్, నార్త్ జోన్ ఐజీ అస్రా గార్గ్ పరిశీలించారు. అక్కడ చేపట్టనున్న భద్రతా ఏర్పాట్ల గురించి పోలీసులకు సూచనలిచ్చారు. మరో 2 రోజుల్లో వేదిక నిర్మాణ పనులు పూర్తవుతాయని టీవీకే నిర్వాహకులు తెలిపారు. పనులను గురువారం ప్రముఖ హస్యనటుడు దాడి బాలాజీ, కొందరు సినీ ప్రముఖులు పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను స్థానిక పోలీసులతో పాటు దుబాయ్‌కు చెందిన ప్రైవేటు సెక్యూరిటీ సంస్థకు అప్పగించారు. శుక్రవారం పార్టీ ప్రముఖుడు, మహానాడు నిర్వహణ బాధ్యతలు చేపట్టిన జాన్ ఆరోగ్యసామి దుబాయ్ సెక్యూరిటీ సంస్థ నిర్వాహకులతో కలిసి మహానాడు ప్రాంగణాన్ని సందర్శించారు. కార్యకర్తల కోసం విక్రవాండి మనికి వచ్చేవారి కోసం విక్రవాండి, విల్లుపురంలలో హోటళ్లు, లాడ్జీల్లో గదులన్నీ బుక్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రేషన్ దుకాణాల్లో టమాటా విక్రయానికి సన్నాహాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ప్రస్తుతం టమాటా ధరలు అమాంతం పెరిగి సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రేషన్ దుకాణాలలో విక్రయించడానికి ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. బయటి మార్కెట్లలో కిలో రూ.100గా ఉంది. దీంతో సహకారశాఖ హరిత ఫాంలలో మొదటి విడతగా రాయితీపై రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. గతంలో ఇదే పరిస్థితి రావడంతో రేషన్ దుకాణాలలో తక్కువ ధరకు విక్రయించారు. అదేవిధంగా ప్రస్తుతం తక్కువ ధరకు చౌక దుకాణాల్లో విక్రయించడానికి చూస్తున్నారు. శాసనసభ సమావేశాల తర్వాత దీనిపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని సచివాలయ వర్గాలు పేర్కొన్నాయి.

పలుమార్లు తమిళనాడు వచ్చిన రతన్ టాటా | ప్రసంగాలతో స్ఫూర్తి పొందిన విద్యార్థులు

రాష్ట్రంలో మధుర జ్ఞాపకాలు

ఈనాడు-చెన్నై, న్యూస్‌టుడే-ఆర్కేనగర్

పలకరిస్తే చాలు.. నవ్వుతూ ఉండే రతన్‌టాటా మోమును తమిళనాడువాసులు మర్చిపోలేకున్నారు. ఆయన మరణం తీవ్ర విషాదం నెలకొల్పింది. రాష్ట్రానికి ఆయనెంతో సుపరిచితులు. టాటా తరపున ఎన్నో కంపెనీలు ఇక్కడ స్థాపించడం, ఇతర పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకోవడంతో ఆయన తరచూ రాష్ట్రానికి విచ్చేసేవారు. ఇలా చాలాసార్లు చెన్నై, ఇతర నగరాలకు వచ్చారు. వచ్చిన ప్రతిసారీ యువతను కలుసుకోవడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. టాటా గ్రూప్‌ను శిఖరాగ్రానికి చేర్చిన ఆయన.. తనను కలిసేందుకు వచ్చిన విద్యార్థులు, యువత.. ఇలా ఎవరున్నా.. వారి స్థాయికి దిగి మరీ మాట్లాడేవారు. స్ఫూర్తిదాయక మాటలతో ఆకట్టుకునేవారు. అలాంటి మధుర జ్ఞాపకాలు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి.

భరతనాట్యంపై ఆసక్తిగా..

మదురై లక్ష్మీ సుందరంహాల్‌లో 14ఏళ్ల యువతి లక్ష్మీ త్యాగరాజన్ భరతనాట్య ఆరంగేట్రం ప్రదర్శనను వ్యాపార దిగ్గజం, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్‌టాటా వీక్షించారు. ప్రదర్శనకు మంత్రముగ్ధులయ్యారు. ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఆమె ప్రతిభను తెలుసుకోవడంతో పాటు భరతనాట్య శిక్షణ వెనక ఆసక్తికర విషయాల్ని తెలుసుకున్నారు. 2014 ఆగస్టు 20న ఈ కార్యక్రమం జరిగింది.


లక్ష్మీ త్యాగరాజన్‌తో వినయంగా రతన్‌టాటా

మనసును అడగండి..

2015 జులై 15న రతన్‌టాటా చెన్నై వచ్చారు. గ్రేట్ లేక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ 11వ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. విద్యార్థులనుద్దేశించి ప్రత్యేక ప్రసంగం చేశారు. 'కఠినమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఎన్నో ఇబ్బందులు ఎదురవ్వొచ్చు. ఆ నిర్ణయం తీసుకునేముందు మనసును ప్రశ్నించుకోవాలి. చేసేది ఒప్పా, తప్పా అని. విద్యార్థులైన మీరు ఎంతో అదృష్టవంతులని మర్చిపోవద్దు. విద్యార్థుల నుంచి వచ్చే స్ఫూర్తిపైనే దేశ గతిని మార్చేయనున్నారు' అన్నారు.


విద్యార్థినికి పతకం అందిస్తూ..


విద్యార్థినికి ఆటోగ్రాఫ్ ఇస్తూ..

నిజాయతీగా ఉండండి

చెన్నై ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి 2016 జనవరి 25న రతన్‌టాటా విచ్చేసి అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. 'మీరు ఏ రంగాన్నైనా ఎంచుకొని నిపుణులుగా మారండి. నిజాయితీగా ఉండండి' అని హితబోధ చేశారు. ప్రజలు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటేనే భారత్ వెలిగిపోతుందని చెప్పారు.


అవార్డుతో గౌరవంగా..

2014 ఆగస్టు 12న చెన్నైలోని మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఎంఎంఏ) ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రతన్ టాటా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుల నుంచి అమాల్గమేషన్ బిజినెస్ లీడర్‌షిప్ అవార్డు అందుకున్నారు.



స్టాలిన్‌తో కాసేపు..

రతన్‌టాటా చెన్నై వచ్చినప్పుడు ఇప్పటి ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌ను కలుసుకున్నారు. అప్పట్లో స్టాలిన్ డీఎంకే అధ్యక్షుని హోదాలో మాత్రమే ఉన్నారు. 2019 జనవరి 25న ఆయన స్వగృహానికి వెళ్లి మరీ మర్యాదపూర్వకంగా కలిశారు.



కోయంబత్తూరుకు తరచూ..

రతన్ టాటా పలుమార్లు కోయంబత్తూరుకు వచ్చివెళ్లారు. టాటా గ్రూప్ కోసం పనిచేసే కొన్ని కంపెనీలు అక్కడున్నాయి. 2014 ఆగస్టు 4న జయెమ్ ఆటోమోటివ్స్ కంపెనీకి వచ్చారు. తన పర్యటనల్లో స్థానిక పారిశ్రామికవేత్తలతో ముచ్చటించేవారు. వాహనాల తయారీలో వైవిధ్యాన్ని వారి నుంచి అడిగి తెలుసుకునేవారు.

సంగీత దర్శకుడు హారిస్ జయరాజ్ పిటిషన్ కొట్టివేత

ప్యారిస్, న్యూస్‌టుడే: వస్తుసేవల పన్ను విధింపునకు సంబంధించి జీఎస్టీ జాయింట్ డైరక్టరు పంపిన నోటీసు రద్దు చేయాలని సంగీత దర్శకుడు హారిస్ జయరాజ్ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. హారిస్ జయరాజ్‌కు వస్తుసేవల పన్ను విధించే వ్యవహారమై జీఎస్టీ జాయింట్ డైరక్టర్ 2018లో నోటీసులు పంపారు. వాటికి వ్యతిరేకంగా హారిస్ జయరాజ్ తరపున మద్రాసు హైకోర్టులో 2019లో పిటిషన్ దాఖలైంది. విచారణ జరిపిన జస్టిస్ సంతోష్‌కుమార్, జస్టిస్ శరవణన్ ధర్మాసనం నోటీసుకు వ్యతిరేకంగా కేసు దాఖలు చేయడం కుదరదని తెలిపింది. సంబంధిత అధికారి వద్ద మాత్రమే విన్నవించుకోవచ్చని ఇది వరకే హైకోర్టు ఓ కేసులో తీర్పు ఇచ్చిందని తెలిపింది. నోటీసుకు హారిస్ జయరాజ్ జవాబివ్వాలని, అందుకు అభ్యంతరాలను తెలియజేయొచ్చని సూచించి గురువారం పిటిషన్ కొట్టివేసింది. హారిస్ జయరాజ్ అభ్యంతరాలను పరిశీలించి నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని జీఎస్టీ అధికారులకు ఉత్తర్వులు ఇచ్చింది.

మహిళలు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలి

ప్యారిస్, న్యూస్‌టుడే: లైంగిక వేధింపులు మాత్రమే కాకుండా మానసిక ఒత్తిడి సహా తమకు ఎదురయ్యే అన్ని సమస్యలపై ప్రభుత్వ హెల్ప్‌లైన్ నెంబరును ఎప్పుడైనా సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని మంత్రి గీతాజీవన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ ట్రయల్ బ్లేజర్ తరపున 'ఆడ పిల్లలను కాపాడుకుందాం' అనే శీర్షికతో అవగాహన ప్రచారం గురువారం తూత్తుక్కుడిలో నిర్వహించారు. దీనిని మంత్రి గీతాజీవన్ ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు. మహిళలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి ముందుకురావట్లేదని, 181, 1098 సహాయక నెంబర్లపై ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. పాఠ్య పుస్తకాల్లో ఈ నెంబర్లు ముద్రించడంతో అందరికీ అవగాహన ఏర్పడిందన్నారు. ఫిర్యాదు చేసేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పర్యవేక్షణ ఉంచాలని, ఆడపిల్లలు పరిచయస్థులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.


మాట్లాడుతున్న మంత్రి గీతాజీవన్


చెన్నై తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వలసరవాక్కంలోని కార్యాలయంలో ఆయుధ పూజ వేడుకలు ఘనంగా జరిగాయి. నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, టీనగర్


గాయత్రి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి

నటుడు రాజేంద్రప్రసాద్‌కు కేతిరెడ్డి పరామర్శ

చెన్నై: ప్రముఖ సినీనటుడు రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి రెండు రోజుల క్రితం గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజేంద్రప్రసాద్‌ను తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు, తమిళనాడు తెలుగు యువశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి పరామర్శించారు. హైదరాబాద్‌లోని నివాసంలో ఎంఎస్‌ఆర్ క్రియేషన్స్ ఛైర్మన్ మంద మల్లికార్జున్‌రెడ్డితో కలిసి రాజేంద్రప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గాయత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రప్రసాద్‌తో తమకు ఎనలేని అనుబంధం ఉందన్నారు. 'నవోదయం' సినిమా నుంచి తమకు పరిచయం ఏర్పడిందని, ఆయన కుటుంబ సభ్యులతో కూడా మంచి అనుబంధం ఉందని తెలిపారు. చిన్న వయసులోనే గాయత్రి మరణించడం ఎంతో బాధను కలిగించిందన్నారు.

సెల్‌ఫోన్‌లో రీల్స్ చూస్తూ బస్సు నడిపిన డ్రైవర్

సస్పెండ్ చేసిన రవాణా శాఖ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్‌లో రీల్స్ చూస్తూ బస్సు నడిపిన డ్రైవర్‌ని రవాణాశాఖ సస్పెండ్ చేసింది. దసరా సందర్భంగా సొంతూర్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ ప్రత్యేక బస్సులు నడిపింది. తగినంత మంది డ్రైవర్లు లేనందున తాత్కాలిక డ్రైవర్లను అదనపు బస్సులకు కేటాయించారు. ఇదిలా ఉండగా అదనంగా ఓ ఎక్స్‌ప్రెస్ బస్సు తిరుపతి నుంచి ప్రయాణికులతో చెన్నై మాధవరానికి బయల్దేరింది. బస్సులో ప్రయాణికుల రద్దీ నెలకొంది. తాత్కాలిక డ్రైవర్ సెల్‌ఫోన్‌లో రీల్స్ చూస్తూ నడపడాన్ని గమనించిన ఓ మహిళా ప్రయాణికురాలు వీడియో తీసింది. సుమారు 2 గంటలపాటు అతను అలాగే నడిపాడు. వీడియోను సామాజిక మాధ్యమంలో పెట్టడంతో వైరల్‌గా మారింది. దీంతో డ్రైవర్ పార్తిబన్‌ను సస్పెండ్ చేస్తూ రవాణాశాఖ చర్యలు చేపట్టింది.

రీల్స్ చూస్తూ బస్సు నడుపుతున్న పార్తిబన్ →




కిలో రూ.200కు చేరిన చైనా వెల్లుల్లి



విల్లివాక్కం: మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, హరియాణా రాష్ట్రాలలో వెల్లుల్లి అధికంగా సాగవుతుంది. రాష్ట్రంలోని దిండిగల్లు జిల్లాలో కొండ వెల్లుల్లి పండుతుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉత్పత్తి చాలా వరకు తగ్గింది. టోకు వ్యాపారులు గోదాములలో అధికమొత్తంలో దాచేయంతో వెల్లుల్లి కృత్రిమ కొరత ఏర్పడి ధర అమాంతం పెరిగింది. కోయంబేడు మార్కెట్‌లో రూ.400 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో చైనా నుంచి అధిక మొత్తంలో దిగుమతి అవుతోంది. కిలో రూ.60కు విక్రయించిన చైనా వెల్లుల్లి ప్రస్తుతం రూ.200కి చేరింది. దీని గురించి కోయంబేడు మార్కెట్ హోల్‌సేల్ గార్లిక్ వ్యాపారి ఒకరు మాట్లాడుతూ.. చైనా వెల్లుల్లి కొండ వెల్లుల్లిలాగా పెద్దదిగా ఉంటుందని, కొద్దిగా ఘాటుగా ఉంటుందని తెలిపారు. కానీ, నాటు వెల్లుల్లిలాగా ఎక్కువ రోజులు నిల్వ ఉండదని, వారం రోజులకు పైన నల్లగా మారుతుందని, ఘాటు కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం నాటు వెల్లుల్లి ధర పెరగడంతో చైనా వెల్లుల్లి ధర క్రమేపీ పెరుగుతుందన్నారు.

'కేటీవో'తో 'ఐఆర్‌సీటీసీ' ఒప్పందం

వడపళని, న్యూస్‌టుడే: సాంస్కృతిక, పర్యాటకాభివృద్ధికి ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ), కొరియా టూరిజం ఆర్గనైజేషన్ (కేటీవో)తో గురువారం చెన్నైలో ఓ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజరు రాజలింగం బాసు, దక్షిణ కొరియా కేటీవో రీజినల్ డైరెక్టరు మియాంగ్ కిల్ యూన్ ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. చెన్నైలోని కేంద్ర పర్యాటక విభాగ అసిస్టెంట్ డైరెక్టరు ఎస్.పద్మావతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలతో రాజలింగం బాసు, మియాంగ్ కిల్ యూన్ తదితరులు

వైభవంగా ఆయుధపూజ

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరులో ఆయుధపూజను శుక్రవారం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్మాగారాలు, దుకాణాలను శుభ్రం చేసి తోరణాలు ఏర్పాటు చేశారు. అందులోని పరికరాలకు ప్రత్యేక పూజలు చేశారు. కొండాముత్తూరులోని అన్నాడీఎంకే కార్యాలయంలో మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి సరస్వతి పూజ నిర్వహించగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న మాజీ మంత్రి వేలుమణి


పువ్వులు కోస్తున్న దృశ్యం

పెరిగిన చామంతి ధరలు.. ఆనందంలో రైతులు

విల్లివాక్కం: హోసూర్ ప్రాంతంలో చామంతి పువ్వుల కోత ప్రారంభమైన నేపథ్యంలో ధరలు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణగిరి జిల్లా హోసూర్, పాగలూర్, ఉత్తనపల్లి, తేన్‌గనికోట్టై తదితర ప్రాంతాలలోని వాతావరణానికి తగ్గట్లు రైతులు పువ్వుల తోటలు సాగుచేస్తున్నారు. ముఖ్యంగా చామంతి, చెండుమల్లి, బటన్ గులాబి అధికంగా సాగవుతుంది. ఇక్కడ కోసే పువ్వులను హోసూర్ మార్కెట్‌కు తీసుకెళ్లి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు, బెంగళూరుకు విక్రయానికి పంపుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆశించినమేర పడటంతో చామంతి మొక్కలు విరగబూశాయి. ఈ నేపథ్యంలో ఆయుధపూజ, విజయదశమి సందర్భంగా పువ్వుల ధరలు పెరిగాయి. హోసూర్ ప్రాంతంలో పువ్వుల కోతలు జోరుగా సాగుతున్నాయి. కొన్ని రోజులక్రితం హోసూర్ మార్కెట్‌లో చామంతి కిలో రూ.80 విక్రయించగా గురువారం నుంచి రూ.280 పలుకుతోంది. రెండో రకం రూ.200, మూడో రకం రూ.160కి విక్రయిస్తున్నారు.

ఆలయ వేడుకలు అడ్డుకోవడానికి ప్రభుత్వ యత్నం: హిందూ మున్నని

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆలయ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం కావాలనే అడ్డుకోవడానికి యత్నిస్తోందని హిందూ మున్నని రాష్ట్ర అధ్యక్షుడు కాటేశ్వర సి.సుబ్రమణియం ఆరోపించారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. తిరునెల్వేలి జిల్లా పాళయంకోట్టై మారియమ్మన్ ఆలయ దసరా వేడుకల్లో అమ్మవారి ఊరేగింపు సమయంలో విద్యుత్తు తీగలు తెగిపడి ప్రమాదం జరిగితే తమకు ఎలాంటి బాధ్యతలేదని విద్యుత్తుబోర్డు ఉత్తరం ఇచ్చిందన్నారు. ఏళ్లుగా ఉన్న రథం ఎత్తు తగ్గించాలని చెప్పారన్నారు. లక్షల మంది భక్తులు పాల్గొనే తిరునాళ్లకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు.



26న గ్యాస్ సిలిండర్ల డెలివరీమెన్‌ల సమ్మె

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 26వ తేదీ గ్యాస్ సిలిండర్ల డెలివరీమెన్‌లు సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల డెలివరీమెన్‌ల సంఘం ఓ ప్రకటన విడుదల చేసింది. 2024 ఏడాదికిగాను చట్ట ప్రకారం అందజేయాల్సిన కనీస బోనస్ 8.33 శాతం రూ.12 వేలు అందజేయాలని, నిర్ణయించిన కనీస వేతనం పూర్తిగా అందించాలని, 6 నెలలకోసారి ప్రభుత్వం నిర్ణయిస్తున్న కనీస కరవు భృతి అందజేయాలని డిమాండ్ చేసింది. వారానికోసారి వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని, ప్రభుత్వ సెలవుకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కోరింది. సీనియారిటీ ఆధారంగా సంబంధిత గ్యాస్ ఏజెన్సీలు గుర్తింపు కార్డులు అందజేయాలని పేర్కొంది. డిమాండ్ల సాధనకు ఈనెల 26న ఒకరోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంస్థల ఏజెన్సీలలో పనిచేస్తున్న డెలివరీ మెన్‌లు సమ్మెలో పాల్గొంటున్నట్టు తెలిపింది.

వర్షాలకు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టండి

కలెక్టర్లకు ప్రభుత్వ ఆదేశం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఈనెల 15వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ కమిషర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు జారీ చేసిన ఉత్తర్వుల్లో.. రాష్ట్రంలో ఈనెల 15 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, కావున విపత్తు నివారణకు ప్రామాణిక మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. భారీ వర్షాల నుంచి అతి భారీవర్షాలు కురిస్తే అన్ని జిల్లాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రెస్క్యూ ఆపరేషన్‌కు అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచాలని, జిల్లా స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

రతన్ టాటాకు చికిత్స అందించిన కోవై వైద్యుడు


రతన్ టాటాతో ఇలక్కుమణన్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా వయోధిక ఆరోగ్య సమస్యలతో 9వ తేదీ కన్నుమూసిన సంగతి తెలిసిందే. నిరాడంబరుడైన టాటా ఇదివరకు వెన్ను నొప్పితో బాధపడుతుండగా కోవైకి చెందిన వైద్యుడి వద్ద చికిత్స పొందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2019 అక్టోబరులో ముంబయికి చెందిన కృష్ణస్వామి అనే వ్యక్తి కోవై జిల్లా మరుదమలైకి చెందిన మర్మకళ నిపుణుడు ఇలక్కుమణన్‌ను సంప్రదించారు. వ్యాపార దిగ్గజం టాటా వెన్ను నొప్పితో బాధపడుతున్నారని, మర్మకళతో వైద్యం అందించాలని కోరడంతో ఇలక్కుమణన్ ముంబయి వెళ్లారు. చికిత్స కల్పించిన వెంటనే టాటా ఎలాంటి తడబాటు లేకుండా లేచి నడిచారని ఇలక్కుమణన్ వెల్లడించారు. కోవైకు చేరుకుంటే తనను కలుస్తానని చెప్పారని వివరించారు. టాటా మరణ వార్త విని దిగ్భ్రాంతికి గురైనట్లు ఇలక్కుమణన్ శుక్రవారం కంటతడి పెట్టుకున్నారు.

18 మంది రాష్ట్ర మత్స్యకారులపై దాడి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నాగపట్నానికి చెందిన 18మంది జాలర్లపై శ్రీలంక సముద్రపు దొంగలు దాడి చేసి పలు వస్తువులను దోచుకెళ్లారు. నాగపట్నం జిల్లా సెరుదూర్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్.. మరో నలుగురు జాలర్లతో కలిసి 8వ తేదీ పడవలో సముద్రంపైకి చేపలవేటకు వెళ్లారు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి చేపలు పడుతున్న సమయంలో 9 మంది శ్రీలంక దొంగలు వచ్చి దాడి చేసి వలలు, పలు వస్తువులను దోచుకెళ్లారు. గాయపడిన ఐదుగురు రాష్ట్ర జాలర్లు సెరుదూర్ తీరానికి చేరుకున్నారు. అదేవిధంగా మూడు పడవలలో చేపలు పడుతున్న 13మంది మత్స్యకారులను శ్రీలంక దొంగలు కత్తులు చూపి బెదిరించి దాడి చేసి రూ.6 లక్షల విలువైన వలలు, జీపీఎస్ పరికరాలు, సెల్‌ఫోన్లు తదితర వస్తువులను దోచుకెళ్లారు. గాయపడిన జాలర్లు ఓరత్తూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలపై కీళయూర్ తీరగస్తీ దళం దర్యాప్తు జరుపుతోంది.

టీ ఎస్టేట్ కార్మికులకు వైద్య పథకం


విలేకరులతో మాట్లాడుతున్న ముత్తుకుమార్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: వ్యాధుల బారినపడిన టీ తోటల కార్మికుల కుటుంబాలు వైద్య ఖర్చులకు ఒకేసారి రూ.50 వేలు సబ్సిడీ అందజేస్తున్నట్టు తేయాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముత్తుకుమార్ తెలిపారు. కున్నూర్‌లోని సౌత్ ఇండియన్ తేయాకు బోర్డు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశానికి వైస్ ఛైర్మన్ రాజేష్ చందర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈడీ ముత్తుకుమార్ సమావేశానంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తేయాకు అభివృద్ధికి ఈ ఏడాది రూ.668 కోట్లు కేటాయించగా దక్షిణ బారతదేశానికి 20 శాతం నిధులు అందుతాయని అంచనా వేస్తున్నట్టు ఆశాభావం వ్యక్తం చేశారు. గత నాలుగు నెలలుగా రైతులు నాణ్యమైన తేయాకు అందిస్తుండగా ప్రస్తుతం 230 మిలియన్ కిలోల తేయాకు ఎగుమతి అవుతోందన్నారు. దీన్ని 400 మిలియన్ కిలోలకు పెంచి స్థానికంగా వినియోగాన్ని పెంచడానికి చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఎస్టేట్‌లలో పనిచేస్తున్న కార్మికులకు మానవనరుల అభివృద్ధి పథకం ద్వారా వివిధ రకాల గ్రాంట్లు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్మికులకు, వారి కుటుంబానికి పలు రకాలుగా సాయం అందజేస్తున్నట్టు గుర్తు చేశారు. అర్హులైన కార్మికుల కుటుంబాలు వైద్య ఖర్చులకు ఒకేసారి రూ.50 వేలు పొందడానికి http:///serviceonline.gov.in అనే పోర్టల్‌లో ఈనెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయవచ్చని సూచించారు.

విడాకుల కేసు రద్దయినా అబద్ధపు కారణాలకు పరిహారం పొందొచ్చు

మద్రాసు హైకోర్టు

ప్యారిస్: విడాకుల కేసు కొట్టివేసినా అబద్ధపు కారణాలతో విడాకులు కోరిన భర్త నుంచి భార్య పరిహారం పొందొచ్చని మద్రాసు హైకోర్టు తెలిపింది. వేలూరు జిల్లాకు చెందిన ఓ భర్త తన భార్య హింసిస్తోందని దాఖలు చేసిన పిటిషన్‌ను వేలూరు కుటుంబ సంక్షేమ కోర్టు కొట్టివేసింది. విడాకుల పిటిషన్‌లో భర్త అబద్ధపు సమాచారం చెప్పాడని భార్య తరపున వేలూర్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిని కూడా కోర్టు కొట్టివేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ భార్య తరపున హైకోర్టులో అప్పీల్ దాఖలైంది. తాను హింసిస్తున్నట్లు భర్త అబద్ధం చెప్పడంతో మానసిక ఒత్తిడికి గురయ్యానని, పరిహారం అందించాలని ఆమె కోరింది. పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ లక్ష్మీనారాయణన్ విడాకుల కేసు కొట్టివేసినా గృహహింస నిరోధక చట్టం కింద కుటుంబ సంక్షేమ కోర్టు, సివిల్ కోర్టు పరిహారాన్ని నిర్ణయించవచ్చని ఉత్తర్వులు ఇచ్చారు.



కాంచీపురం: కామాక్షి అలంకరణలో శక్తి అమ్మవారు ■ కాంచీపురం: దుర్గాదేవిగా కామాక్షమ్మ ■ కాంచీపురం: ముత్తుమారియమ్మన్ అవతారంలో రేణుకాంబాళ్ ■ పళ్లిపట్టు: రాజరాజేశ్వరిగా కన్యకా పరమేశ్వరి ■ పళ్లిపట్టు: శ్రీకొల్లాపురమ్మ ■ తిరువణ్ణామలై: లింగ పూజలో పరాశక్తి అమ్మవారు

నేత్ర పర్వం.. అమ్మవారి దర్శనం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం నగరంలోని అనేక అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కామాక్షి అమ్మవారి ఆలయంలో గురువారం రాత్రి అమ్మవారు దుర్గాదేవిగా నవరాత్రి మండపంలో భక్తులకు దర్శనమిచ్చారు. సెంగుందర్ పూవరసన్ తోపులో వెలసిన రేణుకాంబాళ్ ఆలయంలో గురువారం రాత్రి అమ్మవారిని ముత్తుమారియమ్మన్‌గా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. చెన్నై వడపళనిలోని ఆండవర్ ఆలయంలో ఉన్న శక్తి అమ్మవారు గురువారం రాత్రి కామాక్షిగా భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా లలితా సహస్రనామ పారాయణం, వేద పారాయణం చేశారు. శుక్రవారం అమ్మవారిని మీనాక్షిగా అలంకరించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఏకదిన లక్షార్చన నిర్వహించారు. శనివారం విజయదశమి సందర్భంగా శక్తి అమ్మవారి సన్నిధిలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యారంభం కార్యక్రమాలను నిర్వహిస్తారు.

● **తిరువణ్ణామలై:** తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో పరాశక్తి అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. తర్వాత సాయంత్రం అమ్మవారిని లింగ పూజకు అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

● **పళ్లిపట్టు:** పళ్లిపట్టు బజారువీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు శుక్రవారం అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే పట్టణ దేవత శ్రీకొల్లాపురమ్మ ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి భక్తుల సందర్శనకు ఉంచారు.



దేవీ నవరాత్రుల సందర్భంగా కొరుక్కుపేటలో దాండియా, గార్బా నృత్యాలతో సందడి చేస్తున్న స్థానికులు
- న్యూస్‌టుడే, వడపళని

వైభవంగా చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

ప్యారిస్, న్యూస్‌టుడే: జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో మహార్ణవమి సందర్భంగా శుక్రవారం చండీ హోమం వైభవంగా జరిగింది. ఆలయ మహా మండపంలో హోమగుండం ఏర్పాటు చేసి ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర పంతులు బృందం సంప్రదాయబద్ధంగా హోమం జరిపింది. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త కొల్లా వెంకట చంద్రశేఖర్‌తో పాటు పాలకమండలి సభ్యులు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్ సుదర్శనం, టీవీ రామకుమార్, సీఆర్ కిషోర్ బాబు, తాతా బద్రీనాథ్ హోమ ద్రవ్యాలను అందించారు. ముందుగా వేద పారాయణం, మూలమంత్ర హోమం, అమ్మవారికి త్రికాల అభిషేకాలు, అలంకరణలు, ఆరాధనలు నిర్వహించారు. సాయంత్రం సుహాసిని పూజ, అనంతరం దాదాపు వెయ్యి మంది ముత్తయిదువులకు సుమంగళి ప్రసాదం అందజేశారు. మూలమూర్తిని బంగారు ఆభరణాలతో, ఉత్సవమూర్తిని సురభి వాహనంపై చండీగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఏర్పాటు చేసిన కుమారి జనని భరతనాట్య ప్రదర్శన రంజింపచేసింది. వాసవాంబ అగ్నికి ఆహుతై ప్రపంచానికి అహింసను పరిచయం చేసిన ఘట్టాన్ని తలపించేలా ఏర్పాటు చేసిన అగ్నిగుండ ప్రవేశం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శుక్రవారం ఉత్సవానికి సుకుమార్ గుప్తా కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యదర్శి కిషోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



చండీ అలంకరణలో కన్యకా పరమేశ్వరి

'బన్ బటర్ జామ్' గ్లింప్స్ వీడియో విడుదల





చెన్నై, న్యూస్‌టుడే: రాఘవ్ మిర్దాత్ దర్శకత్వంలో బిగ్‌బాస్ సీజన్-5 విన్నర్ రాజు జయమోహన్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'బన్ బటర్ జామ్'. ఆధ్య ప్రసాద్, భవ్య త్రిఖ హీరోయిన్లు. చార్లీ, శరణ్య పొన్‌వణ్నన్, దేవదర్శిని, మైకెల్ తంగదురై, విజయ్ పప్పు తదితరులు ఇతర తారాగణం. రెయిన్ ఆఫ్ ఆరోస్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి నివాస్ కె.ప్రసన్న సంగీతం సమకూర్చుతున్నారు. కొన్ని రోజుల క్రితం చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ప్రస్తుతం ఆయుధపూజ సందర్భంగా శుభాకాంక్షలతో గ్లింప్స్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది.

'మిస్టర్ హౌస్ కీపింగ్' టీజర్...

చెన్నై: అరుణ్ రవిచంద్రన్ కథ రాసి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మిస్టర్ హౌస్ కీపింగ్'. ఇందులో యూట్యూబర్ హరిభాస్కర్, బిగ్‌బాస్ ఫేమ్ లాస్లియా హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. తేనాండాళ్ ఫిల్మ్స్ పతాకంపై ఇన్వెట్ మీడియా సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ నేపథ్యంలో టీజర్‌ను చిత్ర బృందం శుక్రవారం విడుదల చేసింది.



'గుడ్ బ్యాడ్ అగ్లీ' నుంచి అజిత్ ఫొటో...

చెన్నై: అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్‌కుమార్, త్రిష జంటగా నటిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తర్వాతి దశ చిత్రీకరణ పనులు స్పెయిన్‌లో జరగనున్న నేపథ్యంలో అజిత్‌కుమార్‌కు సంబంధించిన ఫొటోను దర్శకుడు తన 'ఎక్స్' పేజీలో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అజిత్‌కుమార్‌కు సంబంధించిన మరో ఫొటోను కూడా ఆయన తన 'ఎక్స్' పేజీలో విడుదల చేశారు. ఇందులో అజిత్‌కుమార్ వయసు తగ్గినట్టు కనిపించారు.



విద్యార్థులకు ప్రోత్సాహం

క్విజ్ పోటీ విజేతలకు విదేశీ పర్యటన

వడపళని, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గతేడాది విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలను విదేశాలకు తీసుకెళ్లింది. ఈ సంవత్సరం కూడా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతి వారం ఇతర పాఠ్యాంశాలతో పాటు సాహిత్యం, క్విజ్ పోటీలు కూడా నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించింది.

రూ.5.20 కోట్లు...

విజేతలైన విద్యార్థులను విదేశాలకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం రూ.5.20 కోట్లు కేటాయించిందని విద్యాశాఖ డైరెక్టర్ ఎస్.కణ్ణప్పన్ తెలిపారు. గతేడాది సింగపూర్ మలేషియా, జపాన్, దక్షిణకొరియా సందర్శించారు. 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు కోసం ఒక స్మార్ట్ క్లబ్‌లోనూ చేరాలని, ఐదే విద్యయున్న టీచర్లు కూడా విద్యాశాఖ సూచించింది.

బడి వేళల్లో నిర్వహించాలి...

విద్యార్థులకు పోటీలపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. చాలామంది 10 కి.మీ. దూరం నుంచి వస్తున్నారని, పోటీలు పాఠశాల పనివేళల్లో నిర్వహిస్తే ఆమోదయోగ్యమని మైలాపూర్ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి పేర్కొంది. అరివుపురంలోని ప్రాథమిక పాఠశాల టీచర్ ఉమా మహేశ్వరన్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతివారం క్విజ్, వార్తాపత్రికలు చదవడం అలవాటు చేస్తున్నామని అన్నారు.



పాఠశాల విద్యాశాఖ కార్యాలయం

నృత్య వైభవం



తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించే ఉద్దేశంతో దేవస్థానం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. చెన్నైకి చెందిన శ్రీమైత్రి సెంటర్ ఫర్ ఆర్ట్స్ సరళకుమారి బృందం భరతనాట్యం ప్రదర్శన చేపట్టింది. నాట్యాలయ బృందం కూచిపూడి, పేరిణి నాట్య ప్రదర్శనలు జరిగాయి. - న్యూస్‌టుడే యాదగిరిగుట్ట

మత్తుపదార్థాలతో అనర్థాలపై అవగాహన

రెడ్‌హిల్స్: మత్తుపదార్థాలతో అనర్థాలపై అవగాహన ర్యాలీ తిరువళ్లూరులో శుక్రవారం నిర్వహించారు. సబ్ కలెక్టర్ ఆయుష్‌గుప్తా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగిన ర్యాలీలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కరపత్రాలు పంచిపెట్టారు. పలు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ఆయుష్‌గుప్తా

చెన్నై పోర్ట్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఇంద్రనిల్ హజ్రా

వడపళని, న్యూస్‌టుడే: 'కమ్యూనిటీ బిల్డింగ్ కేటగిరీ' కింద చెన్నై పోర్ట్‌కు ప్రతిష్ఠాత్మక 'ఐఏపీహెచ్ సస్టెయినబులిటీ అవార్డు-2024' లభించింది. అంతర్జాతీయంగా ఇలాంటి పురస్కారాన్ని అందుకోవడంలో దేశంలో చెన్నై పోర్టు ప్రథమంగా నిలిచింది. సంప్రదాయ రీతిలో హార్బర్ నిర్వహణ, పరిరక్షణ, పర్యావరణ పరిశుభ్రతను కాపాడుకుంటూ అందిస్తున్న సేవలకు గుర్తుగా పురస్కారం దక్కినట్లు సంబంధిత అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత అయిదేళ్లలో చెన్నై పోర్ట్స్ స్కూలులో 50వేల మందికిపైగా విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించిందని, స్వబోధిని, దివ్యాంగులకోసం ప్రత్యేకంగా వొకేషనల్ సెంటర్, కాస్త బుద్ధిమాంద్యంతో ఉండేవారికి టైలరింగులో శిక్షణ వంటివి చెన్నై పోర్ట్ అందించినట్లు తెలిపారు. అదేవిధంగా క్రీడల కోసం ప్రత్యేక మైదానం, రేవులో పని చేసే వారికి శుభకార్యాలు జరుపుకొనేందుకు అద్దెతో సంబంధం లేకుండా కమ్యూనిటీ హాలు వంటివి నిర్మించింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద జాలర్లకు తనవంతు సాయమందిస్తోంది. 9వ తేదీ జరిగిన వరల్డ్ పోర్ట్స్ కాన్ఫెరెన్స్‌లో చెన్నై పోర్ట్ కార్యదర్శి ఇంద్రనిల్ హజ్రా అవార్డు అందుకున్నారు.

కోవై రైల్వే స్టేషన్‌లో మాక్‌డ్రిల్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: దక్షిణ రైల్వే సేలం డివిజన్, ప్రైవేటు ఆస్పత్రి సంయుక్తంగా కోవై రైల్వే స్టేషన్‌లో ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలను రక్షించడంపై గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కోవై నగర అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ స్టాలిన్ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలను, రైలు ప్రమాదాల్లో చిక్కుకున్న ప్రయాణిలను రక్షించడం, వారికి ప్రథమ చికిత్స అందించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



బాధితులకు ప్రథమ చికిత్స అందించడంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రమాదంలో మృతి చెందిన సైనికుడికి నివాళి

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా ఆర్‌కేపేట యూనియన్ పెద్ద రామాపురం కాలనీకి చెందిన మాజీ సైనికుడు పెరుమాళ్ కుమారుడు పి.స్టాన్లీ (49) జమ్ముకశ్మీర్ రాష్ట్రంలో లేహ్ ప్రాంతంలో భారత సైన్యంలో నాయక్ సుబేదార్‌గా పనిచేస్తున్నారు. గురువారం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో స్టాన్లీ మృతి చెందాడు. ఆయన భౌతికకాయం శుక్రవారం స్వగ్రామానికి చేరుకుంది. జిల్లా కలెక్టరు ప్రభుశంకర్ ఆయన భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.



స్టాన్లీ భౌతికకాయానికి అంజలి ఘటిస్తున్న కలెక్టరు ప్రభుశంకర్

కన్నన్‌కోట్టై నుంచి పూండికి నీటి విడుదల

ఊత్తుకోట, న్యూస్‌టుడే: చెన్నై నగర తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఊత్తుకోట సమీప కన్నన్‌కోట్టై - తేర్వాయ్‌కండ్రిగలోని చెరువులను కలుపుతూ రూ.350 కోట్ల వ్యయంతో 1650 ఎకరాల విస్తీర్ణంలో చెరువు నిర్మించారు. ఇది 2020లో అందుబాటులోకి వచ్చింది. ఇందులో 500 మిలియన్ క్యూసెక్‌ల నీటిని నిల్వజేయవచ్చు. ఈ ప్రాజెక్టు కోసం కన్నన్‌కోట్టై నుంచి ఊత్తుకోట సమీప అంబేడ్కర్‌నగర్ వరకు 9 కిలోమీటర్ల దూరానికి భారీ పైపులు అమర్చారు. కన్నన్‌కోట్టై నుంచి వదిలే నీరు పైపుల గుండా అంబేడ్కర్‌నగర్‌లోని కేపీ (కండలేరు- పూండి) కాలువలోకి చేరుకుంటుంది. అనంతరం అక్కడి నుంచి 25 కి.మీ దూరంలోని పూండి చెరువుకు చేరుకుంటుంది. రుతుపవనాల ప్రభావంగా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆ నీటిని నిల్వజేసేందుకు ప్రస్తుతం చెరువులో ఉన్న నీటిని పూండి చెరువుకు 30 క్యూసెక్‌ల వంతున శుక్రవారం విడుదల చేశారు.



కేపీ కాలువకు చేరుతున్న నీరు

సభ్యత్వకార్డుల పంపిణీ

పెరియపాళ్యం, న్యూస్‌టుడే: పెరియపాళ్యం సమీప తామరైపాక్కంలో అన్నాడీఎంకేలో కొత్తగా చేరిన వారికి సభ్యత్వ కార్డులు అందజేసే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మాజీ మంత్రి బెంజమిన్ అధ్యక్షత వహించి సభ్యత్వ కార్డులు అందజేసి మాట్లాడారు. ఉద్యోగాలు కల్పించడం, శాంతిభద్రతల పరిరక్షణ ఇలా అన్ని రంగాల్లో విఫలమైన డీఎంకే ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు గుర్రుగా ఉన్నారన్నారు. పరందూరు విమానాశ్రయం వ్యతిరేక గ్రామస్థులు, సామ్‌సంగ్ కార్మికులను అణచివేసే ప్రజా వ్యతిరేకత విధానాలను అనుసరిస్తున్న డీఎంకే ప్రభుత్వానికి ప్రజలు త్వరలో బుద్ధి చెబుతారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి జయపాల్, మాజీ ఎమ్మెల్యే మణిమారన్, యూనియన్ అన్నాడీఎంకే కార్యదర్శి మహేంద్రన్, యూనియన్ కౌన్సిలర్ కుళందైవేలు పాల్గొన్నారు.



కార్డు అందిస్తున్న బెంజమిన్

వివాహానికి అంగీకరించలేదని విద్యార్థినిని హత్య చేసి, యువకుడి ఆత్మహత్య

ప్యారిస్, న్యూస్‌టుడే: వివాహానికి అంగీకరించలేదని విద్యార్థినిని హత్య చేసి, యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం సృష్టించింది. పోలీసుల వివరాల మేరకు .. శివగంగై వద్ద మదగుపట్టి ప్రాంతానికి చెందిన మోనిషా(24) ప్రభుత్వ మహిళ కళాశాలలో డిగ్రీ మూడో ఏడాది చదువుతోంది. ఆమెను బంధువైన ఆకాష్(26) ప్రేమిస్తున్నట్లు తెలిసింది. అతన్ని విద్యార్థిని తల్లిదండ్రులు అంగీకరించలేదని సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం ఇంట్లో ఒంటరిగా ఉంటున్న మోనిషా వద్దకి వెళ్లిన ఆకాష్ తనను పెళ్లి చేసుకోవాలని చెప్పి గొడవపడ్డారు. కోపంతో మద్యం సీసాను పగలగొట్టి ఆమె మెడపై దాడి చేయడంతో ఘటనాస్థలిలోనే మృతిచెందింది. అతను కూడా అదే సీసాతో గొంతుకోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కంటైనర్ లారీ ముగ్గురి దుర్మరణం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా కావేరిపట్టిణం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. స్నేహితులైన విజి, వసంతకుమార్, రాహుల్ కలిసి శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈత కొలనులో పడి బాలుడు...

వేళచ్చేరి: అసోం రాష్ట్రానికి చెందిన కృష్ణా, జమున భార్యాభర్తలు. వీరు చెన్నై ఈసీఆర్ అక్కరై ప్రాంతంలోని ఓ ప్రైవేటు రిసార్ట్‌లో ఉంటూ తోట పనులు చేసుకుంటున్నారు. వీరికి ఓ కుమారుడు (5) ఉన్నాడు. గురువారం సాయంత్రం కృష్ణ, జమున ఇంట్లో నిద్రిస్తుండగా బాలుడు ఇంటి బయట ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు అక్కడున్న ఈత కొలనులో పడి మునిగిపోయాడు. కాసేపటికి బయటకు వచ్చిన తల్లిదండ్రులు కుమారుడి కోసం గాలించారు. కుమారుడు ఈత కొలనులో పడి ఉండటాన్ని చూసి బయటకు తీసి వెంటనే సమీపంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు.

తల్లిపాలు తాగి నిద్రించిన శిశువు...

ఆర్కేనగర్: తిరుచ్చి జిల్లా మణప్పారై కోచ్చిపట్టి గ్రామానికి చెందిన స్వామి (35), మీనా భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఇదిలా ఉండగా మీనా ఏడురోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డతో పుట్టింట్లో ఉంటోంది. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున బిడ్డకు పాలిచ్చి మీనా నిద్రించింది. ఆరుగంటల తర్వాత లేచిచూడగా పాపలో ఎలాంటి కదలిక కనిపించలేదు. వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే పాప చనిపోయినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాను బోల్తా.. 13 మందికి తీవ్రగాయాలు



కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం వత్తపాలానికి చెందిన మనోజ్‌కుమార్ వ్యాపారి. ఇతను తన కుటుంబీకులు, బంధువులతో కలిసి వ్యానులో కోవై సమీప వాల్‌పారైకి శుక్రవారం విహారయాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కొండైఊసివళైవు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తాపడింది. ప్రమాదంలో అందులో ఉన్న 13 మంది గాయపడ్డారు. పోలీసులు వారిని ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు

రూ.8 కోట్ల పీఎఫ్ డబ్బులు కాజేసిన మున్సిపల్ ఉద్యోగి అరెస్టు



వినీత్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం సంతాన గోపాలపురానికి చెందిన వినీత్ (23) 2021 నుంచి విళుపురం పురపాలక సంఘంలో రోజువారీ వేతన ప్రాతిపదికన కార్యాలయ సహాయకుడిగా పని చేస్తున్నాడు. ఇతను పురపాలక సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల భవిష్యనిధి (పీఎఫ్) డబ్బులను ట్రెజరీలో చెల్లించేవాడు. వినీత్‌కు కంప్యూటర్‌పై అవగాహన ఉండటంతో అతనికి కంప్యూటర్ సంబంధిత పనిని అధికారులు అప్పగించారు. ఈ క్రమంలో శుభ్రతా కార్మికుడు ఒకరు తన పీఎఫ్ డబ్బులను విత్‌డ్రా చేయడానికి బ్యాంకు వెళ్లగా అతని ఖాతాలో డబ్బులు లేవని చెప్పడంతో దిగ్భ్రాంతికి గురయ్యాడు. అంతేకాకుండా కార్మికుల పీఎఫ్ డబ్బులను చెల్లించడం లేదని ట్రెజరీ అధికారులు స్థానిక ప్రభుత్వ ఆడిట్ విభాగానికి సమాచారం ఇచ్చారు. దీంతో పురపాలక సంఘ కార్యాలయంలో అధికారులు విచారణ చేపట్టారు. ప్రతి నెలా వినీత్ కార్మికుల వేతనాల్లో నిలిపివేసే పీఎఫ్ డబ్బులు కొద్దికొద్దిగా కార్మికుల పేర్లతో నకిలీ దస్త్రాలను తయారు చేసి గత 3 ఏళ్లలో రూ.8 కోట్ల మేర కాజేసినట్లు తెలిసింది. పురపాలక కమిషనర్ వీర ముత్తుకుమార్ విళుపురం ఎస్పీ దీపక్ సవాచ్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు క్రైం విభాగ డీఎస్పీ రామలింగం నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక పోలీస్ బృందం వినీత్‌ను అరెస్టు చేసి దర్యాప్తు జరిపింది. అతను జిల్లా అన్నాడీఎంకే యువజన పాసరై జాయింట్ సెక్రటరీగా వ్యవహరిస్తూ పురపాలక సంఘంలో పనిచేస్తున్నాడని, ఇతనికి అదే ప్రాంతానికి చెందిన వళర్మతి, పనంగుప్పం అజిత్‌కుమార్ సహకరించినట్లు తేలడంతో పోలీసులు వారిపైనా కేసు నమోదు చేశారు. వినీత్ నుంచి లగ్జరీ కార్లు, ఇతర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విళుపురం కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించారు.

క్రైం కార్నర్

గంజాయి విక్రేత...

ప్యారిస్: చెన్నై వలసరవాక్కంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో గంజాయి దాచి విక్రయిస్తున్నట్లు పోలీసులకి సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు సదరు అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు చేపట్టి 7.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి తరలించి విక్రయిస్తున్న యాసర్ అరాఫత్‌ని అరెస్టు చేశారు. సినిమా చిత్రీకరణల్లో లైట్‌మెన్‌గా పనిచేస్తున్న అతను చెన్నైలోని ఐటీ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులకు గంజాయి విక్రయించేవాడని తెలిసింది. కేసు దర్యాప్తులో ఉంది.

విమాన ప్రయాణికుడు...

వడపళని: విమానంలో మహిళా ప్రయాణికురాలితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని ఎయిర్‌పోర్ట్ పోలీసులు అరెస్టు చేశారు. అధికారుల వివరాల మేరకు... బుధవారం జైపూర్ నుంచి ఇండిగో విమానంలో చెన్నైకి ఓ వ్యక్తి బయలుదేరాడు. మహిళా ప్రయాణికురాలు వెనుక సీట్లో అతను కూర్చున్నాడు. ఇదిలా ఉండగా ముందు సీట్లో కూర్చున్న ఆమెతో అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. దీంతో సదరు మహిళ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. విమానం చెన్నైకి చేరుకోగానే ఎయిర్‌పోర్ట్ పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం, అరెస్ట్ చేసిన స్మగ్లర్లను చూపుతున్న ఎస్పీ సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాసన్, సిబ్బంది

భారీగా ఎర్రచందనం స్వాధీనం

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బలగాలు నెల్లూరు జిల్లా పరిధిలో నిర్వహించిన దాడుల్లో భారీగా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతి కపిలతీర్థంలోని ఏపీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లా సోమశిల-అనంతసాగరం మార్గంలో రెండు కార్లలో ఎర్రచందనం దుంగలతో వస్తున్న ఐదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేసి, వారి నుంచి 95 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లను బలగాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తమిళనాడు, పుదుచ్చేరికి చెందినవారని ఎస్పీ తెలిపారు.